సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం । 17 । మార్చి । 2024



యాసంగి సాగు 111 శాతం..

జిల్లాలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో సాధారణ విస్తీర్ణానికి మించి రైతులు పంటల సాగు చేపట్టారు. 8లో



కాంగ్రెస్‌కు 'చందా' రాజీనామా

మాజీ ఎమ్మెల్యే, ఆదివాసీ సంఘాల జాతీయ కన్వీనర్ చందా లింగయ్య దొర కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 8లో



వాతావరణం

జిల్లాలో ఆదివారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయమే ప్రారంభమైన ఎండ గంటగంటకూ పెరుగుతుంది.



న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి శనివారం వైభవంగా సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారు జామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భ గుడి నుంచి తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. అక్కడ విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం స్వామివారికి కంక ణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యక ల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశాం

- డీఈఓ వెంకటేశ్వరాచారి

కొత్తగూడెంఅర్బన్ : ఈనెల 18న ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా విద్యాశాఖ అధికారి వెంక టేశ్వరాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 12,341 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని, ఇందులో బాలురు 5,901, బాలికలు 6,440, సప్లిమెం టరీ విద్యార్థులు 967 మంది ఉన్నారని పేర్కొ న్నారు. రెగ్యులర్ విద్యార్థుల కోసం 70, సప్లి మెంటరీ విద్యార్థుల కోసం మూడు సెంటర్లు ఏర్పాటు చేశామని, పరీక్షల నిర్వహణకు 73 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 73 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 667 మంది ఇన్విజిలేటర్లను నియమించామని వివరిం చారు. ప్రతి సెంటర్‌కు ఒక సిట్టింగ్, ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి మండలంలో అన్ని కేంద్రా లను ఎంఈఓలు పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. పరీక్షల సమాచారం కోసం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని, ఏమైనా సందేహాలుంటే 83666 54191 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ప్రతి రోజు పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉం టుందని, ఉదయం 9 గంటల నుంచే విద్యార్థు లను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తామని, 9.35 గంటల తర్వాత ఎవరికీ అనుమతి ఉండ దని స్పష్టం చేశారు.

కోడ్.. అలర్ట్!



కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను శనివారం విడుదల చేయగా కోడ్ అమల్లోకి వచ్చింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా రెండు పార్లమెంట్ స్థానాల పరిధిలో ఉంది. ఖమ్మం లోక్‌సభ పరిధిలో ఖమ్మం, పాలేరు, వైరా, మధిర, సత్తుపల్లి, కొత్తగూ డెం, అశ్వారావుపేట నియోజకవర్గాలు, మహబూబాబాద్ పరిధిలోకి ఇల్లెందు, పినపాక, భద్రాచలం నియోజకవర్గాలు వస్తాయి. ఎన్నికల కోడ్ వస్తుందని ముందే ప్రచారం జరగ డంతో వారం రోజులుగా రాష్ట్ర మంత్రులు ఉమ్మడి జిల్లాలో రూ.వందల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మరోవైపు నెలరోజులుగా ఏర్పాట్లలో నిమగ్న మైన యంత్రాంగం కోడ్ అమల్లోకి రావడంతోనే పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. ఇక షెడ్యూల్ విడుదలతో ప్రధాన రాజకీయ పార్టీల్లోనూ సందడి నెలకొంది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

వెలువడిన లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్

- రెండు నియోజకవర్గాల పరిధిలో ఉమ్మడి జిల్లా
- ఖమ్మం నామినేషన్లు కలెక్టరేట్‌లో స్వీకరణ
- వచ్చేనెల 18 నుంచి 25 వరకు నామినేషన్లు, మే 13న పోలింగ్
- ఏర్పాట్లలో నిమగ్నమైన యంత్రాంగం
- ప్రధాన రాజకీయ పార్టీల్లో సందడి
- చివరిరోజు మంత్రుల సుడిగాలి పర్యటన

పోలింగ్‌కు రెండు నెలల సమయం

దేశవ్యాప్తంగా ఏడు దశల్లో పోలింగ్ జరగనుండగా, తెలంగాణ, ఏపీల్లో నాలుగో దశలో పోలింగ్ నిర్వ హించనున్నారు. షెడ్యూల్ విడుదలైన శనివారం నుంచి లెక్కిస్తే పోలింగ్‌కు 58 రోజుల సమయం ఉంది. ఏప్రిల్ 18 నుంచి 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అలాగే, మే 13న పోలింగ్ నిర్వహించి, జూన్ 4న ఓట్లు లెక్కించనున్నారు. ఖమ్మం పార్ల మెంట్ స్థానానికి ఖమ్మం కలెక్టరేట్‌లో, మహ బూబాబాద్ స్థానానికి అక్కడి కలెక్టరేట్‌లో నామినే షన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, ఖమ్మం స్థానానికి సంబంధించి ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఈవీఎం డిస్ట్రిబ్యూషన్, ఓట్ల లెక్కిం పునకు సిద్ధమవుతున్నారు. ఖమ్మం పార్లమెంట్‌లో 1,455 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తుండగా, అదనంగా నాలుగు కేంద్రాల కోసం కలెక్టర్ ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు సమర్పించారు.

ఖరారు కాని ఖమ్మం అభ్యర్థులు..

రాజకీయ పార్టీల్లో ఎన్నికల సందడి నెలకొనగా.. షెడ్యూల్ వెలువడడంతో ప్రధాన పార్టీలు అభ్య ర్థుల ఎంపిక, గెలుపు వ్యూహాలపై దృష్టి సారిం చాయి. బీఆర్‌ఎస్ ఖమ్మం, మహబూబాబాద్ స్థానాల్లో సిట్టింగ్ ఎంపీలైన నామా నాగేశ్వరరావు, మాలోతు కవితను మరోసారి బరిలోకి దింపింది. ఇక కాంగ్రెస్ మానుకోట స్థానానికి కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్‌ను, బీజేపీ మాజీ ఎంపీ సీతారాంనాయక్‌ను అభ్యర్థులుగా ప్రకటిం చాయి. అయితే, ఖమ్మం స్థానానికి మాత్రం ఆ రెం డు పార్టీల అభ్యర్థులు ఎవరో తేలలేదు. దీంతో అటు ఆశావహులు, ఇటు పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. సీపీఎం, సీపీఐ సైతం ఎన్నికల్లో పోటీకి ఆసక్తి చూపుతుండగా, కాంగ్రెస్‌తో కలిసి వెళ్తాయా.. లేక ఒంటరిగా పోటీ చేస్తాయా అన్నది తేలాల్సి ఉంది.

రూ.వెయ్యి కోట్ల విలువైన పనులకు శ్రీకారం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పార్ల మెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ మూడు నెలల్లో రూ.వెయ్యి కోట్లపై గా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. సీఎం రేవంత్‌రెడ్డి భద్రాచలం, మణుగూరులో ఏర్పాటు చేసిన సభల్లో పాల్గొన్నారు. అలాగే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల్లో అభివృద్ధి పను లకు నిధులు మంజూరు చేయించారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడడానికి కొద్ది గంటల ముందు వరకు కూడా మంత్రులు పొంగులేటి, తుమ్మల పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల్లో అభివృద్ధి పను లకు శంకుస్థాపన చేశారు.

హోర్డింగ్‌లు.. ఫ్లెక్సీల తొలగింపు

ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే రాజకీయ పార్టీల హోర్డింగ్‌లు, ఫ్లెక్సీల తొలగింపుపై సిబ్బంది దృష్టి సారించారు. శనివారం సాయం త్రం నుంచే ఈ ప్రక్రియ మొదలుకాగా, రాజకీయ పార్టీల నేతల విగ్రహాలకు ముసుగు లు తొడిగారు. అలాగే, కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి ఎన్నికలకు సంబంధించి వచ్చే ఫిర్యాదులను 1950 టోల్ ఫ్రీ నంబర్‌తో స్వీకరించనున్నారు. షెడ్యూల్ వెలువడగానే కలె క్టర్ పార్లమెంట్ పరిధిలోని అధికారులతో సమా వేశమై విధి నిర్వహణపై సూచనలు చేశారు. అలాగే, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏపీకి సరిహద్దున ఉండడంతో అశ్వారావుపేట, మధిర, ఎర్రుపా లెం, బోనకల్, సత్తుపల్లి, ముదిగొండ, నేలకొం డపల్లి ప్రాంతాల్లో ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నారు.



అశ్వారావుపేటలో ఫ్లెక్సీలు తొలగిస్తున్న ప్రభుత్వ సిబ్బంది

ఎన్నికలు సజావుగా నిర్వహిస్తాం

- ఈ ప్రక్రియకు ప్రతి ఒక్కరూ సహకరించాలి
- జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల

కొత్తగూడెం అర్బన్ : పార్లమెంట్ ఎన్నికలు సజావు గా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరిం చాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల కోరారు. ఐడీఓసీలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈసీ షెడ్యూల్ ప్రకటించినందున కోడ్ అమల్లోకి వచ్చిందని తెలిపారు. ఏప్రిల్ 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ, మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటాయని చెప్పారు. జిల్లాలో తుది ఓటరు జాబితా ప్రకారం 9,84, 906 మంది ఓటర్లు ఉన్నా రని, ఇందులో పురుషులు 4,78, 685 మంది, మహిళలు 5,06, 165 మంది, ఇతరులు 56 మంది ఉన్నారని వివరించారు. అర్హులై ఉండి జాబితాలో పేరు లేకుంటే ఏప్రిల్ 15 వరకు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 1,095 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఓటర్లకు రెండు కిలోమీటర్ల లోపు దూరంలోనే పోలింగ్ కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

ప్రలోభాలకు గురి చేయొద్దు..

ఓటర్లను రాజకీయ పార్టీలు ప్రలోభాలకు గురి చేయొద్దని, కులం, మతం, ప్రాంతాల విద్వేషాలు పెంచేలా మాట్లాడడం తగదని కలెక్టర్ స్పష్టం చేశారు. రాజకీయ నాయకులు సమావేశాలు నిర్వ హించుకునేందుకు సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతిస్తామని, ఎవరు ముందు దరఖాస్తు చేసు కుంటే వారికే అనుమతి ఉంటుందని తెలిపారు. అయితే ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన స్థలాల్లో, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో నిర్వహించొద్దని సూచించారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్ల వినియో గానికి వీల్లేదని చెప్పారు. ఎస్పీ రోహిత్ రాజ్ మాట్లా డుతూ అక్రమ నగదు, లిక్కర్ సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో అవసరమైన మేర చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, 24 గంటల పాటు నిఘా ఉం చామని తెలిపారు. ఎన్నికల దృష్ట్యా ప్రజలు ఆధా రాలు లేకుండా రూ.50 వేలకు మించి తీసుకెళ్లవ ద్దని కోరారు. తనిఖీల్లో లభ్యమయ్యే నగదును జిల్లాలో ఏర్పాటు చేసే గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తా మని, ఆధారాలు సమర్పిస్తే కమిటీ నగదు విడుదల చేస్తుందని చెప్పారు. సమావేశంలో ఎస్‌డీసీ కాశయ్య, డీఈఓ వెంకటేశ్వరాచారి, అదనపు డీఆర్ డీఓ రవి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ తిరుమ లాచారి, ఎన్నికల సూపరింటెండెంట్ దారా ప్రసాద్, సుశీల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రియాంక ఆల, ఎస్పీ రోహిత్‌రాజ్

లోక్ అదాలత్‌కు విశేష స్పందన



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి

- జిల్లాలో 3,36,784 కేసుల పరిష్కారం
- న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి వెల్లడి

కొత్తగూడెంటౌన్: జిల్లా కోర్టులో శనివారం నిర్వ హించిన జాతీయలోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధి కార సంస్థ కార్యదర్శి జి.భానుమతి మాట్లాడుతూ.. జిల్లాలో 3,36,784 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. సివిల్, క్రిమినల్, మోటార్ వాహన ప్రమాద కేసులతో పాటు బ్యాంక్ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకున్నారని వివరించారు. మొత్తంగా 3,36,784 కేసులు పరిష్కారం కాగా, బాధితులకు రూ.4.75 కోట్ల పరిహారం చెల్లించి నట్లు తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా కొత్తగూడెం లో సివిల్ కేసులు 18, క్రిమినల్ కేసులు 3,746 ట్రాఫిక్ చాలాన్ కేసులు 3,33,002, బ్యాంక్ ప్రీలిటి కేషన్ కేసులు 4, మనీ మాట్రిమోనియల్ కేసులు 12 పరిష్కారమయ్యాయని తెలిపారు. వివిధ న్యాయ స్థానాల్లో 10 లోక్ అదాలత్ బెంచ్‌లు ఏర్పాటు చేసి కేసులను పరిష్కరించినట్లు చెప్పారు. మోటార్ వాహన ప్రమాదంలో రూ.77.80 లక్షలు నష్టప రిహారం చెల్లించేలా బీమా కంపెనీలను ఆదేశించి నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కక్షిదారులకు పులిహోర, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

న్యాయవాద వృత్తి గౌరవప్రదమైనది

జిల్లా జడ్జి వసంత్ పాటిల్

మణుగూరు రూరల్ : న్యాయవాద వృత్తి గౌరవప్రద మైనదని జిల్లా జడ్జి వసంత్ పాటిల్ అన్నారు. మణుగూరు ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ కోర్టు ఆవర ణలో బార్ అసోసియేషన్, అఖిల భారత న్యాయ వాదుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్న సముద్రం శరత్‌చంద్ర స్మారక న్యాయ గ్రంథాలయా న్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన మెగా లోక్ అదాలత్‌లో మాట్లాడుతూ.. ప్రతీ న్యాయవాది రాజ్యాంగానికి కట్టుబడి వృత్తిలో రాణించాలన్నారు. మారుతున్న పరిస్థితులకు అను గుణంగా చట్టాలపై విజ్ఞానం పెంచుకోవాలని, కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యు లు కొల్లి సత్యనారాయణతో కలిసి కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ సభ్యులు రమేష్, మణుగూరు మెజిస్ట్రేట్ మీసాల వెంకటేశ్వర్లు, డీఎస్పీ వంగా రవీందర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. శ్రీనివాసరావు, న్యాయవాదులు చిర్ర రవికుమార్, పానుగోటి కిషన్‌రావు, పోశం భాస్కర్, సర్వేశ్వర రావు, కవిత, సావిత్రి, పద్మావతి, చిర్ర సరస్వతి, వాసవి, సంధ్య, శైలజ, విజయలక్ష్మి, రుద్ర వెంకట్, నగేష్‌కుమార్, అన్వేష్, సాంబ పాల్గొన్నారు.



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న జడ్జి వసంత్ పాటిల్

వైభవంగా శ్రీ బాలాజీ కల్యాణం

అన్నపురెడ్డిపల్లి : మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని శనివారం వైభవంగా జరిపించారు. స్వామి వారికి ఉదయం పంచామృ తాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామివారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ..

ఆలయంలో ఈనెల 23 నుంచి జరుగనున్న బ్రహ్మో త్సవాల పోస్టర్లను స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారా యణ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నపురెడ్డిపల్లిలోని ఆలయాల అభి వృద్ధికి కృషి చేస్తానని అన్నారు. మండల కేంద్రాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ వెంకటరమణ, నాయకులు వనమా గాంధీ, వేముల రమణ, బానోత్ భీముడు, పర్సా వెంకటేశ్వర్లు, రుంజా బుచ్చమ్మ, దోసపాటి రాంబాబు, లక్ష్మారెడ్డి, పూర్ణ, యాదాల వెంకన్న , చల్లా పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

కాలినడకన వెళ్లి.. పోషకాహారం అందించి..

- అటవీ ప్రాంతంలో కాలినడకన వెళ్లిన సంక్షేమాధికారి, ఉద్యోగులు
- గొత్తికోయ పిల్లలకు టీషర్టుల పంపిణీ..

కొత్తగూడెం రూరల్: అటవీ ప్రాంతంలో రెండు కిలోమీటర్ల మేర నడుచుకుంటూ వెళ్లి గొత్తికోయ పిల్లలకు పోషకాహారం అందిం చారు జిల్లా సంక్షేమ శాఖ అధికారి విజేత. లక్ష్మీ దేవిపల్లి మండలం గట్టుమళ్ల పంచాయతీ పరిధిలోని క్రాంతినగర్ గ్రామానికి సిబ్బందితో కలిసి శనివారం కాలినడకన వెళ్లిన విజేత.. గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, చిరు ధాన్యాలపై అవగాహన కల్పించారు. పిండం ఎదుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివ రించారు. గొత్తికోయల పిల్లలు కూడా అడవు లపై ఆధారపడకుండా బాగా చదివించాలని, అం గన్‌వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు పంపించాలని సూచించారు. అనంతరం పిల్లలకు టీ షర్టులు పం పిణీ చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ కనకదుర్గ, సెక్టార్ సూపర్‌వైజర్ అశోకకుమారి, వెంకటరమణ, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, రమాదేవి పాల్గొన్నారు.



టీషర్టులు ఆవిష్కరిస్తున్న విజేత తదితరులు

నామినేటెడ్ బొనాంజా

ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురికి రాష్ట్ర స్థాయి పదవులు?

- అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా పొదెం
- విద్యా మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా 'మువ్వా'
- గిడ్డంగుల కార్పొరేషన్ ఛైర్మన్‌గా రాయల
- నేతలకు సమాచారం.. ఉత్తర్వులపై ఉత్కంఠ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: నామినేటెడ్ పదవుల పం పకం మొదలైంది. ఉమ్మడి జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీలోని పలువురు ముఖ్యనేతలు రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టుల కోసం ఎదురుచూస్తుండగా.. పార్లమెంట్ ఎన్నికల ముందే భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. ఇంతలోనే ఆశావహుల ఎదురుచూపులు ఫలించేలా లోక్‌సభ ఎన్నికల వేళ ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల భర్తీకి కదిలినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాకు మూడు రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టులు దక్కనున్నాయని సమాచారం. రాష్ట్ర విద్యా మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా మువ్వా విజయ్‌బాబు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్‌గా రాయల నాగేశ్వరరావు, అటవీ అభి వృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా పొదెం వీరయ్యను నియ మించినట్లు తెలిసింది. ఆయా నేతలకు సమాచారం ఇవ్వగా, అధికారిక ఉత్తర్వులు వెలువడాల్సిఉంది.



పొదెం వీరయ్య



మువ్వా విజయ్‌బాబు



రాయల నాగేశ్వరరావు

టికెట్ ఆశించి.. నామినేటెడ్‌కు..

టీపీసీసీ నేత రాయల నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటి నుంచి పాలేరు టికెట్ ఆశిస్తూ వచ్చారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అనుచరుడిగా ఉన్న ఆయనకు పాలేరు టికెట్ ఖాయ మని జోరుగా ప్రచారం సాగింది. అయితే పొంగు లేటి శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో పాలేరు స్థానాన్ని ఆయనకు కేటాయించారు. అంతకుముం దు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాయల కాం గ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి.. ఆతర్వాత పాలేరు టికెట్ కూడా దక్కక రాయల అసంతృప్తితో ఉన్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్ర స్థాయి పదవి ఇస్తామంటూ కాంగ్రెస్ నేతలు బుజ్జగించడంతో ఆయన పార్టీలోనే కొనసాగుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం చేశారు. అనుకున్నట్లు గానే కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో రాష్ట్ర స్థాయి పదవి రాయలకు దక్కనుందనే చర్చ సాగిం ది. ఈ మేరకు గిడ్డంగుల సంస్థ ఛైర్మన్‌గా ప్రభుత్వం ఆయనను నియమించాలని నిర్ణయించినట్లు తెలిసింది. రాయల స్వస్థలం ముదిగొండ మండలం వెంకటాపురం కాగా, ప్రస్తుతం ఖమ్మంలో నివాస ముంటున్నారు.

డీసీసీబీ నుంచి పయనం

పెనుబల్లి మండలం లంకప ల్లి గ్రామానికి చెందిన మువ్వా విజయబాబు రాజకీయ ప్రస్థానం టీడీపీ తో మొదలైంది. ఆ తర్వాత బీఆర్‌ఎస్‌లో కొంతకాలం కొనసాగగా.. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పెను బల్లి సహకార సొసైటీ అధ్యక్షుడిగా ఉన్న మువ్వా 2013 నుంచి 2018 వరకు డీసీసీబీ ఛైర్మన్‌గా పని చేశారు. కాంగ్రెస్ పార్టీలో మేనిఫెస్టో కమిటీ సభ్యుడి గానూ ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరాక ఖమ్మం అసెంబ్లీ స్థానం టికెట్ ఆశించిన వారి జాబితాలో మువ్వా పేరు కూడా ఉంది. పార్టీ అధికారంలోకి రావడంతో తమ నేతకు నామినేటెడ్ పదవి ఖామ మని ఆయన అనుచరులు ధీమా వ్యక్తం చేస్తున్నట్లు గానే విద్యా మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పదవిలో నియమించినట్లు సమాచారం.

ములుగు నుంచి భద్రాద్రికి..

ములుగు జిల్లా మంగపేట మండలం తొండ్యాల లక్ష్మీపురం గ్రామానికి చెందిన పొదెం వీరయ్య ములుగు నియోజకవర్గం నుంచి 1999, 2004 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2009, 2014 ఎన్నికల్లో ఓటమి పాలైన వీరయ్య.. 2018లో భద్రాచలం నియోజకవర్గం నుంచి విజయం సాధిం చారు. తిరిగి గత ఎన్నికల్లో పరాజయం పొందిన వీరయ్య ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం డీసీసీ అధ్య క్షుడిగా కొనసాగుతున్నారు. ఇప్పుడు ఆయన అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైనట్లు తెలిసింది.

పరీక్షలు ఏకాగ్రతతో రాయాలి

- ఎస్సెస్సీ విద్యార్థులకు ఐటీడీఏ పీఓ సూచన

భద్రాచలం : గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల ల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఎలాం టి భయాందోళనలు మనసులో పెట్టుకోకుండా ఏకాగ్రతతో పరీక్షలు రాయాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన చేశారు. పరీక్షలు బాగా రాసి ఏ గ్రేడ్‌లో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. పరీక్షలు బాగా రాస్తే గిరిజన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉం టుందని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు 55, వసతి గృహాలు 21, బెస్ట్ అవైలబుల్ పాఠశాలలు 03.. మొత్తం 79 విద్యాసంస్థల్లో 2,587 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నా రని తెలిపారు. ఇందులో1,139 మంది బాలురు, 1,410 మంది బాలికలు.. మొత్తం 2,549 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండగా, 38 మంది సుదీర్ఘ కాలంగా సెలవులో ఉన్నారని వివరించారు. హాజరయ్యే విద్యార్థులంద రినీ సకాలంలో పరీక్ష కేంద్రాలకు తరలించాలని ప్రధానో పాధ్యాయులు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులకు సూచించారు. ఎలాంటి అక్రమాలకు తావు లేకుం డా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని, పరీక్ష కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రతీ విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించిన పీఓ.. అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్తమ రైతుగా దమ్మపేట వాసి

దమ్మపేట : మండల కేం ద్రానికి చెందిన కొత్తా ఉమామహేశ్వరరావు మాజీ ఉపరాష్ట్రపతి వెంక య్యనాయుడు చేతుల మీదుగా ఉత్తమ రైతు అవార్డు అందుకున్నారు. హైదరాబాద్ హైటెక్స్‌లో గ్రామ భారతి కిసాన్ ఆధ్వర్యంలో శనివారం సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శన కార్యక్రమం నిర్వహిం చారు. ఇందులో దమ్మపేటకు చెందిన సేంద్రియ రైతు ఉమామహేశ్వరరావు ఉత్తమ రైతుగా ఎంపికయ్యారు.



అవార్డు అందుకుంటున్న ఉమామహేశ్వరరావు

క్లుప్తంగా

పెద్దమ్మగుడి ఇన్‌చార్జ్ ఈఓగా సుదర్శన్


బాధ్యతలు స్వీకరిస్తున్న సుదర్శన్

పాల్వంచరూరల్ : మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీ కనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయ ఈఓ ఎన్.రజనీ కుమారి సెలవులో వెళ్లారు. దీంతో దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మణుగూరులోని శ్రీ నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం కార్య నిర్వహణాధికారి జి.సుదర్శన్‌ను ఇన్‌చార్జ్ ఈఓగా నియమించగా శనివారం ఆయిన బాధ్యతలు స్వీకరించారు.

ఎస్‌సీఈఆర్‌టీ సభ్యురాలిగా ఇందిరా ప్రియదర్శిని


ఇందిరా ప్రియదర్శిని

బూర్గంపాడు: స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్(ఎస్‌సీఈఆర్‌టీ) సభ్యురాలిగా బూర్గంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలు ఇందిరా ప్రియదర్శిని నియమితుల య్యారు. ఈ హోదాలో ఆమె రెండేళ్లపాటు విధులు నిర్వహించనున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి వందలాదిమంది ఉపాధ్యాయులు ఈ మెంబర్ షిప్ కోసం పోటీపడగా ఇందిరా ప్రియదర్శిని ఒక్కరు మాత్రమే అర్హత సాధించారు. శనివారం ఆమె పాఠశాల హెచ్‌ఎమ్ రవిలాదేవి నుంచి రిలీవ్ ఆర్డర్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా ఇందిరను హెచ్‌ఎమ్, ఉపాధ్యాయులు, పీఆర్‌టీయు జిల్లా బాధ్యులు వెంకటేశ్వరరావు, రవి, శంకర్, మంగయ్య తదితరులు అభినందించారు.

చెక్ డ్యామ్ నిర్మాణానికి శంకుస్థాపన


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు తదితరులు

దుమ్ముగూడెం : మండల పరిధిలోని లచ్చిగూడెం, గుర్రాలబైలు గ్రామాల్లో సుమారు 400 ఎకరాల ఆయకట్టుకు నీరు అందించేలా చెక్ డ్యామ్ నిర్మాణానికి భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 6.60 కోట్ల నిధులతో చెక్ డ్యామ్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. వాగులపై చెక్ డ్యామ్‌ల నిర్మాణంతో సాగునీరు లభించడంతోపాటు భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఖరీఫ్ సీజన్ నాటికి నిర్మాణం పూర్తి చేసి, రైతులకు సాగునీరు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ రేసులక్ష్మి, ఇరిగేషన్ ఈఈ హెచ్‌వి రాంప్రసాద్, డీఈలు మధుసూదనరావు, జె.తిరుపతి, జేఈలు రాజ్‌సుహాస్, వెంకటేష్, ఎంపీఓ ముత్యాలరావు, ఏఓ నవీన్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి, కార్యదర్శి కణితి రాముడు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహం అడ్డగింత

సుజాతనగర్: మండల పరిధిలోని గరీబ్‌పేట గ్రామంలో శుక్రవారం రాత్రి రహస్యంగా జరుగుతున్న బాల్యవివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. సుజాతనగర్‌లోని సుందరయ్యనగర్‌కు చెందిన 30 ఏళ్ల యువకుడికి, అతని బంధువైన 15 ఏళ్ల బాలికతో వివాహం నిశ్చయించారు. రహస్యంగా వివాహం చేసేందుకు గరీబ్‌పేటలో రామాలయానికి చేరుకున్నారు. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు, అధికారులు వివాహాన్ని అడ్డుకున్నారు. వధూవరుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బాల్యవివాహం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మైనార్టీ తీరే వరకు వివాహాలు జరిపించవద్దని సూచించారు.

ఇసుక ర్యాంప్ వద్ద లారీ డ్రైవర్ల ధర్నా


ధర్నా చేస్తున్న లారీ డ్రైవర్లు

దుమ్ముగూడెం : మండలంలోని తూరుబాక ఇసుక ర్యాంపు వద్ద రోడ్డుపై ఇసుక లారీల డ్రైవర్లు శనివారం ధర్నా నిర్వహించారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. తూరుబాక ఇసుక ర్యాంప్ నుంచి ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీలను రోడ్ పర్మిట్ లేకపోవడంతో భద్రాచలం వెళ్లే దారిలో ఏపీ ఎటపాక పోలీస్ స్టేషన్ వద్ద పోలీసులు ఆపి జరిమానా విధిస్తున్నారని డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో ర్యాంపులో లారీల్లో ఇసుక లోడ్ చేయకపోవడంతో ఐదు రోజులుగా ఇక్కడ పడిగాపులు కాస్తున్నామని, అధికారులు తక్షణమే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,045

యాసంగి సాగు.. 111 శాతం


కరకగూడెంలో సాగు చేస్తున్న వరి పొలం

- లక్ష్యానికి మించి పండిస్తున్న రైతులు
- ఉద్యాన పంటలు 113 శాతం.. ఇతర పంటలు 108 శాతం

సూపర్‌బజార్(కొత్తగూడెం): యాసంగి సీజన్‌లో లక్ష్యానికి మించి రైతులు పంటలు సాగు చేస్తున్నారు. ప్రధానంగా వరి, జొన్న, మొక్కజొన్న పంటలు అధికంగా వేశారు. ఉద్యాన పంటలలో మిర్చి, ఆయిల్‌పామ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే గత యాసంగితో పోలిస్తే మాత్రం సాధారణ పంటల విస్తీర్ణం ప్రస్తుతం తగ్గింది. 2022 – 23 యాసంగి సీజన్‌లో సాధారణ విస్తీర్ణం 2,12,462 ఎకరాలు కాగా, ఈ యాసంగిలో 1,72,960 ఎకరాలకు తగ్గించారు. ప్రారంభంలో మందకొడిగా పంటలు వేసినప్పటికీ క్రమేపీ ఊపందుకున్నాయి. చివరకు సాధారణ విస్తీర్ణాన్ని అధిగమించి 1,92,351 ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలు వేశారు. సాగునీటి వనరులున్న ప్రాంతాల్లో మాత్రమే పంటల విస్తీర్ణం పెరిగింది. మొత్తంగా వ్యవసాయ పంటల సాధారణ విస్తీర్ణం 63,228 ఎకరాలు కాగా, లక్ష్యానికి మించి 68,357 ఎకరాల్లో (108 శాతం) పంటలు సాగవుతున్నాయి. ఉద్యాన పంటల సాధారణ విస్తీర్ణం 1,09,732 ఎకరాలు కాగా, 1,23,994 ఎకరాల్లో (113 శాతం) పంటలు నమోదయ్యాయి.

వరి సాగు చేస్తున్నా..



సంప్రదాయమైన వరి పంట వేశాం. యాసంగి గత మూడు సీజన్ల మాదిరిగానే ఆలస్యం అయింది. అయినప్పటికీ వరి పంటనే పండిస్తున్నాం. సాగునీటి వనరులు ఉన్నందున పంటలకు ఇబ్బంది ఏమీ లేదు.

–ఈసం సత్యనారాయణ, దేవరనాగారం, కరకగూడెం మండలం

జిల్లాలో సాగైన పంటల వివరాలు (ఎకరాల్లో)

పంట	సాధారణ విస్తీర్ణం	సాగైంది	శాతం
వరి	36,867	44,549	121
జొన్న	807	1,098	138
మొక్కజొన్న	16,913	18,142	107
పెసర	1,428	436	31
మినుము	837	212	25
పత్తి	34	17	50
కంది	46	3	7
వేరుశనగ	2,414	2,212	92
నువ్వులు	410	134	33
పొద్దుతిరుగుడు	514	179	35
అలసంద	1,146	688	60
ఉలవలు	9	4	44
చెరకు	675	19	3
పొగాకు	1,128	512	45
ఇతర పంటలు	--	152	--
మొత్తం	45,535	64,436	108
మిర్చి	4,082	5,986	147
ఆయిల్‌పామ్	45,535	64,436	142
కూరగాయలు	2,301	532	23
ఇతర పంటలు	57,814	53,040	92
మొత్తం	1,09,732	1,23,994	113

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుస్తుంది..

ఎంపీ కవిత, పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా


మాట్లాడుతున్న రేగా కాంతారావు, పక్కన ఎంపీ కవిత, ఎమ్మెల్సీ తాతా మధు తదితరులు

చర్ల రూరల్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ నుంచి మళ్లీ బీఆర్ఎస్ గెలుస్తుందని ఎంపీ, బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవిత పేర్కొన్నారు. శనివారం చర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్లమెంట్‌లో కొట్లాడి ట్రైబల్ యూనివర్సిటీ సాధించామని తెలిపారు. భద్రాచలం రెండో వారధి పనులు త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కేంద్రంపై ఒత్తిడి తెచ్చామని గుర్తుచేశారు. భద్రాచలం నియోజకవర్గ ప్రజలు తనను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ కవిత అరెస్టును ఖండించారు. మహిళ పట్ల బీజేపీ, కాంగ్రెస్‌లు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు.

వచ్చే ఆగస్టు 15న సీఎం జెండా ఎగురవేయరు : ఎమ్మెల్సీ

ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌ను గెలిపించిన ప్రజలు వంద రోజుల పాలన చూసిన తర్వాత బాధపడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కరెంటు, మంచినీటి కష్టాలు లేవన్నారు. వచ్చే ఆగస్టు 15న జాతీయ జెండాను ముఖ్యమంత్రి ఎగురవేయరని పేర్కొన్నారు. ఎవరు ఎగురవేస్తారని విలేకరులు ప్రశ్నించగా మీరే చూస్తారని పేర్కొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మాట్లాడుతూ భద్రాచలం నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్‌ను అసెంబ్లీ ఎన్నికల్లో ఆదరించినట్లే పార్లమెంటు ఎన్నికల్లో కూడా ఆదరించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఇచ్చిన ఆరు హామీల్లో ప్రభుత్వ ఖజానాకు భారం పడనటువంటి హామీలను మాత్రమే అమలు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల అనంతరం గ్రామస్థాయి నుంచి రాష్ట్ర కమిటీ వరకు పార్టీ నిర్మాణం చేపడుతామని తెలిపారు.

పార్టీ సమావేశానికి హాజరుకాని ఎమ్మెల్యే

చర్లలో శనివారం జరిగిన నియోజకవర్గస్థాయి బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశానికి భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన కొన్ని పరిణామాల దృష్ట్యా ఎమ్మెల్యే అధికార కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

కాంగ్రెస్‌కు మాజీ ఎమ్మెల్యే రాజీనామా

లోక్‌సభకు పోటీ చేస్తానని చందా లింగయ్య వెల్లడి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య

కరకగూడెం: కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే, ఆదివాసీ సంఘాల జాతీయ కన్వీనర్ చందా లింగయ్య దొర ఆ పార్టీకి రాజీనామా చేశారు. కరకగూడెం మండలం చిరుమళ్లలోని సమ్మక్క దేవాలయ ప్రాంగణంలో శనివారం జరిగిన రాష్ట్రంలోని 13 వివిధ ఆదివాసీ సంఘాలు, రిటైర్డ్ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1974లో కాంగ్రెస్‌లో చేరిన తాను పేదల అభ్యున్నతికి పాటుపడగా, తన సేవలను గుర్తించకుండా ఆదివాసీ సమాజాన్ని అణచివేసేలా మహబూబాబాద్ లోక్‌సభ టికెట్‌ను లంబాడీలకు ఇచ్చారని తెలిపారు. గతంలో బీజేపీ నుంచి గవర్నర్ పదవికి అవకాశం వచ్చినా వదులుకున్నానని చెప్పారు. అయినా టికెట్ విషయంలో అధిష్టానం వ్యవహరించిన తీరుతో నిరసనగా పార్టీకి రాజీనామా చేయగా, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి ఆదివాసీ జేఏసీ తరఫున పోటీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. అనంతరం ఆదివాసీలకు టికెట్ ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ దిష్టి బొమ్మలు దహనం చేశారు.

30 రోజులకే వరి కంకులు

కంకులు పక్వానికి రావేమోనని రైతుల ఆందోళన


నెల రోజులకే ఈనిన వరి మొక్కలను చూపిస్తున్న రైతులు

ఇల్లెందురూరల్: మూడు నెలలకు చేతికి రావాల్సిన పంట 30 రోజులకే గింజ దశకు చేరుకుంది. ఇంత త్వరగా వచ్చిన కంకులు పక్వానికి చేరుకుంటాయో లేదోనని వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత యాసంగిలో ఇల్లెందు ఏజెన్సీలో పలువురు రైతులు ఓ కంపెనీకి చెందిన విత్తనాలతో వరి సాగు చేపట్టారు. ఇల్లెందు, మహబూబాబాద్ పట్టణాల్లో విత్తనాలు కొని, కొమరారం ఉమ్మడి గ్రామపంచాయతీ పరిధిలో 24 మంది రైతులు 56 ఎకరాల్లో పంట సాగు చేశారు. ఏజెన్సీలోని ఇతర ప్రాంతాల్లో కూడా వందల ఎకరాల్లో ఈ రకం విత్తనాలు వినియోగించినట్లు రైతులు చెబుతున్నారు. ఇప్పటి వరకు ఎకరానికి రూ.25వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టారు. నాట్లు వేశాక 60 రోజులకు వరి కంకులు రావాల్సి ఉండగా, సదరు కంపెనీ విత్తనాలు వినియోగించిన రైతుల పొలాల్లో నెల రోజులకే కంకులు వస్తున్నాయి. దీంతో పంట చేతికి వస్తుందో, రాదోనని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. సమస్యను వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, సదరు కంపెనీ విత్తనాలు వినియోగించిన ప్రతీ చోట ఇదే పరిస్థితి ఉందని, మందు పిచికారీ చేస్తే కొంత మెరుగుపడుతుందని సలహా ఇచ్చారని రైతులు పేర్కొంటున్నారు. ఇక వ్యాపారులు మాత్రం కొంత ఆలస్యంగా నాటు వేయడం వల్లే ఈ పరిస్థితి తలెత్తి ఉంటుందని చెబుతున్నట్లు రైతులు తెలిపారు. పంట నష్టం జరిగితే తమకు పరిహారం చెల్లించాలని కోరుతున్నారు. ఇదేవిషయమై ఏఓ సతీష్‌ను వివరణ కోరగా.. సదరు కంపెనీ విత్తనం వినియోగించిన చాలా చోట్ల అదే సమస్య వచ్చిందని, క్షేత్రస్థాయిలో పరిశీలించి, శాస్త్రవేత్తల పరిశీలనకు సిఫారసు చేశామని తెలిపారు. వారిచ్చే నివేదిక ఆధారంగా రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు.

50కేజీల గంజాయి స్వాధీనం?

కొత్తగూడెంటౌన్: పట్టణ పరిధిలో ఓ కారులో శనివారం అక్రమంగా తరలిస్తున్న 50 కేజీల గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. ఐదుగురు వ్యక్తులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గంజాయి, నిందితులను ఠాణాకు తరలించినట్లు సామాజిక మాధ్యమాల్లో జోరుగా ప్రచారం జరిగింది. ఈ విషయమై పోలీసులను సంప్రదిస్తే వివరాలు చెప్పేందుకు నిరాకరించారు.

వాహనాలు స్వాధీనం

దుమ్ముగూడెం : మండలంలోని నడికుడి గ్రామంలో అనుమతులు లేకుండా మట్టి తోలకాలు చేస్తున్న ట్రాక్టర్, డోజర్ వాహనాలను శనివారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. గ్రామంలో రోడ్డు నిర్మాణానికి అక్రమంగా మట్టి తరలిస్తుండగా వాహనాలను పట్టుకున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు.


రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలుశిక్ష

ఇల్లెందు: మద్యం తాగి వాహనం నడిపిన ముగ్గురు వ్యక్తులకు ఇల్లెందు కోర్టు శనివారం జైలుశిక్ష విధించింది. ఒక్కొక్కరికి రూ.1,500 జరిమానా, రెండు రోజులు జైలుశిక్ష విధిస్తూ ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి దేవరపల్లి కీర్తిచంద్రిక రెడ్డి తీర్పు చెప్పారు. ఇల్లెందు 21 ఫిట్ ఏరియాకు చెందిన బోల్ల పవన్, జగదాంబా గుంపునకు చెందిన మెట్ల సునీల్, చెరువుకట్ట ఏరియాకు చెందిన ముజాహిద్‌లకు న్యాయమూర్తి శిక్ష విధించారని సీఐ టి.కరుణాకర్ తెలిపారు.

కోతుల దాడిలో వ్యక్తికి గాయాలు

ములకలపల్లి: ములకలపల్లికి చెందిన వైద్యుడు కారంపూడి సత్యనారాయరాజుపై శనివారం కోతులు దాడి చేశాయి. ఎడమచేతి భుజభాగంలో గాయాలయ్యాయి. వానరమూకల వికృతచేష్టలతో భయాందోళన చెందుతున్నామని, కోతులను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య


జగదీష్ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

అశ్వాపురం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన యువకుడు శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఎస్సీ కాలనీకి చెందిన అయిలపొంగు జగదీష్(19) ప్రేమ విఫలం కావడంతో మనస్తాపం చెంది శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ అశోక్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా నిరుపేద కుటుంబం కావడంతో దహన సంస్కారాలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సత్యప్రకాష్ రూ.రెండు వేలు ఆర్థికసాయం అందజేశారు. ఎంపీపీ ముత్తినేని సుజాత, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు కుటుంబసభ్యులను పరామర్శించారు.

పురుగుల మందు తాగి వృద్ధుడు..

దమ్మపేట: కుటుంబ సభ్యులు మందలించారని క్షణికావేశంలో పురుగుల మందు తాగి ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని అల్లిపల్లి గ్రామానికి చెందిన నందిగం వెంకటేశ్వరరావు (72) అతిగా మద్యం తాగుతున్నాడు. శుక్రవారం మద్యానికి డబ్బులు కావాలని భార్యను అడగగా, ఆమె మందలించింది. దీంతో మద్యం మత్తులో ఉన్న అతడు క్షణికావేశంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు దమ్మపేట ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

అప్పుల బాధతో నేత కార్మికుడు..

తిరుమలాయపాలెం: అప్పులు తీర్చలేని మనోవేదనతో నేత కార్మికుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని తెట్టెలపాడుకు చెందిన పెంటి వెంకన్న (47) నేత పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అప్పుల భారంతో ఇబ్బంది పడుతున్న ఆయన మానసిక ఆందోళనకు గురై శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఆ తర్వాత గ్రామశివారు ఎస్సారెస్పీ కాల్వ పక్కన ఉరి వేసుకోగా, శనివారం ఉదయం గుర్తించిన గ్రామస్తులు ఆయన భార్యాపిల్లలకు సమాచారం ఇచ్చారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లాలో శనివారం సాయంత్రం జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందగా, తుపాకీ, మందుగుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలోని కోయిల్‌బెడా పోలీస్ స్టేషన్ పరిధిలో గల సిల్పురాస్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారంతో జిల్లాకు చెందిన డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్, సీఆర్‌పీఎఫ్, కోబ్రా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో సిల్పురాస్ సమీప అటవీ ప్రాంతంలో తారసపడిన మావోయిస్టులు పోలీసుల పైకి కాల్పులు జరుపుతూ పారిపోతుండగా పోలీసులు సైతం ఎదురుకాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఒక గుర్తు తెలియని మావోయిస్టు మృతి చెందగా, అతడి వద్ద స్టెన్‌గన్, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఈ ఘటనను కాంకేర్ జిల్లా ఎస్పీ ఐకే అలేసేలా ధ్రువీకరించారు.

చికిత్స పొందుతున్న యువకుడు...


ప్రవీణ్ (ఫైల్)

పాల్వంచరూరల్: పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. తోగ్గూడెం తండాకు చెందిన ఆజ్మీరా ప్రవీణ్(27) డిగ్రీ చదివాడు. ఉద్యోగం రాకపోవడంతో ఇంటి వద్దనే ఖాళీగా ఉంటున్నాడు. దీంతో మనస్తాపం చెంది ఈ నెల 13న ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి కొత్తగూడెం, అక్కడి నుంచి ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి మామ మోహన్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

రోడ్డుప్రమాదంలో యువకుడు..

కొణిజర్ల: ఆటో, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్న ఘటన లో ఓ యువకుడు మృతి చెంద గా, మరో ఇద్దరు మహిళలకు గా యాలయ్యాయి. కొణిజర్ల – మ ల్లుపల్లి గ్రామాల మధ్య శనివా రం రాత్రి జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. మల్లుపల్లికి చెందిన ఆలకుంట ఉపేందర్ (20) బైక్‌పై కొణిజర్ల వెళ్తుండగా, చింతలచెర్వు మూలవద్ద కొణిజర్ల నుంచి మల్లుపల్లి వెళ్తున్న ఆటో పరస్పరం ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన ఉపేందర్‌ను స్థానికులు కొణిజర్లలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఆటోలో ఉన్న మాలోత్ మోతి, శాంతికి గాయాలయ్యాయి. ఉపేందర్ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శంకరరావు తెలిపారు. మృతుడు కూలీ పని చేస్తుంటాడు.

కౌన్సిలర్ భర్తపై కేసు నమోదు

ఇల్లెందు: పట్టణంలోని 7వ వార్డు కౌన్సిలర్ సామల మాధవి భర్త రవితేజపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. రవితేజ సీఎం, మంత్రులను అసభ్యంగా దూషిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్దకు వెళ్లి కూడా దూషించాడు. దీంతో ప్రసాద్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

దాడి ఘటనలో...

ఇల్లెందు: దాడి ఘటనలో శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో వారసత్వంగా ఉన్న భూమిలో సింగరేణి రిటైర్ కార్మికుడు ఇద్దమూరి ఆగయ్య కంచె ఏర్పాటు చేస్తుండగా, అదే గ్రామానికి చెందిన ఇద్దమూరి తిరుపతి, అతని భార్య రాజేశ్వరి, కుమారుడు గోపి కలిసి.. నీకు భూమి ఎక్కడిదంటూ దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సందీప్‌కుమార్ తెలిపారు.

రోటోవేటర్ చోరీ ఘటనలో..

పట్టణంలోని సమాఖ్య కార్యాలయం ఆవరణలో ఉన్న రోటోవేటర్ చోరీపై ఫిర్యాదు అందగా ఎస్‌ఐ సందీప్ కుమార్ కేసు నమోదు చేశారు.

దంపతులపై దాడి..

సుజాతనగర్: దంపతులపై దాడి ఘటనలో ఇద్దరు వ్యక్తులపై సుజాతనగర్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ జుబేదా బేగం కథనం ప్రకారం.. లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన గుగులోత్ మోతీలాల్, చామంతి దంపతులు గ్రామంలో చిన్న దుకాణం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన భూక్యా ప్రసాద్ శుక్రవారం రాత్రి మద్యం మత్తులో దుకాణానికి వెళ్లి కూల్ డ్రింక్ కావాలని అడిగాడు. కూల్ డ్రింక్ లేదని నిర్వాహకులు తెలపగా ఆగ్రహానికిలోనై భోజనం చేస్తున్న మోతీలాల్ ప్లేటును కాలుతో తన్నాడు. అంతటితో ఆగకుండా చామంతి చేయి పట్టుకుని బయటకు ఈడ్చుకుంటూ వెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. మోతీలాల్ అడ్డుకునే ప్రయత్నం చేయగా ప్రసాద్ సోదరుడు భూక్యా శివ దాడికి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.